క్లుప్తంగా

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్వరి

సూర్యాపేట రూరల్: సూర్యాపేట జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇవ్వాలని జాతీయ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛన్‌ను రూ.2వేల నుంచిరూ. 5వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కోటమ్మ, అనంతుల మల్లేశ్వరి, అలివేలు, జయసుధ, లక్ష్మి, దంతాల పద్మరేఖ, కళ, అంజమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న సంకినేని వరుణ్‌రావ్

అర్వపల్లి : బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్‌రావ్ అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో ఇటీవల బీజేవైఎం నాయకుడు కుంచం శివశంకర్ తండ్రి రాములు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు నల్లగుంట్ల నరేష్, జిన్న అశ్విన్, అంగోత్ శ్రీనివాస్‌నాయక్, బొమ్మెర నరేష్, దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగారం : మండలంలోని పేరబోయినగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు తీగుళ్ల ప్రశాంత్ మాతృమూర్తి, గ్రామ సర్పంచ్ తీగుళ్ల స్వరూపప్రశాంత్ అత్త తీగుళ్ల రామనర్సమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో స్థానిక వైస్ ఎంపీపీ గుంట్లకండ్ల మణిమాల బుధవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శోభారాణి, గుండగాని అంబయ్యగౌడ్, దోమల బాలమల్లు, యారాల రాంరెడ్డి, యారాల నర్సింహారెడ్డి, వడ్డే పరుశరాములు, దొడ్డి ప్రేమయ్య, రాంమూర్తి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

చివ్వెంల: యువత.. స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో గ్రామానికి చెందిన సంక్రాంతి మధుసూదన్ రెడ్డి నిర్మించిన ఫౌల్ట్రీఫామ్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువత కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిళ్ల కృష్ణ, ఉప సర్పంచ్ శివరాత్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడిగా రాములు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఇటీవల ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మూడవ రాష్ట్ర మహాసభల్లో తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎనుకున్నట్లు ములకలపల్లి రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తూ వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఆరాధ్య ఫౌండేషన్ గ్రామకమిటీ ఎన్నిక


న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ మండల, గ్రామ కమిటీల బాధ్యులు

మద్దిరాల : మండలంలోని కుక్కడం గ్రామంలో ఆరాధ్య ఫౌండేషన్ నూతన గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్దెల కాశీంగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా శిలివేరు బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బత్తెం వీరన్న, ప్రధాన కార్యదర్శిగా గోండ్యాల రమేష్, సంయుక్త కార్యదర్శిగా పులుగుజ్జ వెంకన్న, కోశాధికారిగా కొండ వేణు, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం ఆరాధ్యఫౌండేషన్ నూతన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల బాధ్యులు తన్నీరు మహేష్, కట్కోజు నాగరాజు, తునికి బద్రి, బెడద కర్ణాకర్, పులుగుజ్జ మస్తాన్, పుల్లయ్య, ఆరునూర్ల చిన్న వీరస్వామి, పులుగుజ్జ యాకయ్య, నర్సయ్య, జలగం యాకస్వామి, పులుగుజ్జ సతీష్, రమేష్, శిలివేరు ముత్తయ్య, మహేష్, ఉమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ అర్జీలు మూలకు..

- తిరుమలగిరిలో క్రమబద్ధీకరణకు నోచుకోని లేఅవుట్ స్థలాలు
- దరఖాస్తులు స్వీకరించి ఏడాదిపైనే..
- నేటికీ పరిశీలించని అధికారులు
- ఎదురుచూపుల్లో 6వేల మంది అర్జీదారులు


తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయం

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం కలగడం లేదు. దీంతో దరఖాస్తుదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. మున్సిపాలిటీల్లో లే అవుట్ అనుమతి లేని స్థలాలను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంట్లో భాగంగా మొదటి సారిగా 2016లో ఈ పథకాన్ని అమలు చేయడంతో వేలాది మందికి ప్రయోజనం కలిగింది. అదే విధంగా మున్సిపాలిటీలకు ఆదాయం కూడా పెరిగింది. నాలుగేళ్ల తరువాత రెండవసారి 2020లో ఎల్ఆర్ఎస్ అమలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే 2021 అక్టోబర్ 31 వరకు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో 6 వేల దరఖాస్తులు వచ్చాయి. 2021 జనవరి 31 వరకు ఈ దరఖాస్తులు పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చింది. గడువు ముగిసి ఏడాదిన్నర అవుతున్నా దరఖాస్తులు మున్సిపాలిటీలోనే మూలుగుతున్నాయి. స్థలాల క్రమబద్ధీకరణ మాత్రం జరగడం లేదు.

రుసుము వసూలు చేసి మరిచారు !

రుసుము పేరిట ఒక్కో దరఖాస్తుకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారు. ఈ నిధులు మున్సిపల్ శాఖ ఖాతాలోనే జమ చేశారు. స్థలాల క్రమబద్ధీకరణ జరిగినట్లయితే జమ చేసిన నిధులు కూడా పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు వినియోగించే అవకాశం ఉండేది. దీని ద్వారా లక్షల రూపాయల ఆదాయం సమకూరేది. కానీ దరఖాస్తులను ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి పరిష్కారానికి నోచుకోడం లేదు.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే..



మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు స్వీకరించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ స్థలాలను క్రమబద్ధీకరిస్తాం. వీటి వల్ల మున్సిపాలిటీ ఆదాయం కూడా సమకూరుతుంది.

– దండు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, తిరుమలగిరి

గండూరి కృపాకర్ జన్మదిన వేడుకలు


గండూరి కృపాకర్‌కు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ జన్మదిన వేడుకలను బుధవారం సూర్యాపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సమక్షంలో గండూరి కృపాకర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కృపాకర్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అంతకు ముందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అల్పాహారంగా పండ్లు పంపిణీ చేశారు. నూతన వ్యవసాయ మార్కెట్‌లో ఆర్తి అసోసియేషన్ నాయకులు మాడుగుల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. 45 వార్డులో అభిమానులు పెద్ద ఎత్తున 44 కేజీలతో ఏర్పాటుచేసిన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, పెద్దిరెడ్డి రాజా, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బండారు రాజా, సలీం, శనగాని రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఎంపికకు నేడు గ్రామసభలు

నాగారం: మండలంలోని డి.కొత్తపల్లి, వర్ధమానుకోట గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు ఎంపికకు గురువారం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.కొత్తపల్లిలో 75, వర్ధమానుకోటలో 50 డబుల్‌బెడ్ రూం ఇళ్ల పంపిణీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించామని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

తిరుమలగిరి (తుంగతుర్తి) : కేంద్ర ప్రభుత్వ పథకాలను పోలింగ్ బూత్ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలని బీజేపీ తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ ఎర్రబెల్లి ప్రదీప్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం తిరుమలగిరిలో నిర్వహించిన బీజేపీ బూత్ స్థాయి కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ నెల 7వ తేదీన నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ సభ్యులతో పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వర్చువల్‌గా మాట్లాడతారని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, బంగారు రాజు, సుభాష్‌రెడ్డి, కె.సోమయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

నాగారం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సాధన యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 7న నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నేరటి మహేష్, గంట మహేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితీయ బహుమతి రూ.10,116లు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ : 9989738948, 8897588445, 9553547534 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మెరుగైన బోధనకే టీఎల్ఎం మేళాలు

- ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్


తిరుమలగిరి మేళాలో బోధనోపకరణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్


నూతనకల్ : లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : విద్యార్థుల్లో విషయ అవగాహన పెంచి మెరుగైనబోధన చేసేందుకే ప్రభుత్వం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) మేళాలు నిర్వహిస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన టీఎల్ఎం మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు నూతన పద్ధతుల్లో బోధన చేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరిగి అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని ప్రవంతిసతీష్, జెడ్పీటీసీ దూపటి అంజలి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, పీఆర్ఏఈ రవికుమార్, రిసోర్స్ పర్సన్లు కె.అశోక్‌రెడ్డి, వీరస్వామి, వీఎల్ఎన్.చార్యులు, శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.

తరగతి గదులు ప్రారంభం

విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ అన్నారు. తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో రూ.16 లక్షలతో నిర్మించిన 2 అదనపు గదులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, హైదరాబాద్ కౌన్సిలర్ కుదురుపాక శ్రీలతరాములు, సురేందర్, నరేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

మద్దిరాల : బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలను చూసి దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెపట్లపల్లి శోభన్‌బాబు, ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, వైస్ ఎంపీపీ జెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌లఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ ఇంతియాజ్‌ఖాతూన్, ఎంపీటీసీ మార్త అనిత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

నూతనకల్ : అభివృద్ధి, సంక్షేమం రెండు ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను 73 మంది లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ రజాక్, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, తహసీల్దార్ ఎండీ.జమీరుద్దీన్, ఎంపీడీఓ ఇందిరా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపునకే 'తొలిమెట్టు'


ఆత్మకూర్ (ఎస్) : మేళాను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మద్దిరాల : మేళాను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఉపాధ్యాయులు


పెన్‌పహాడ్: ఉపకరణాలను పరిశీలిస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి, ఉపాధ్యాయులు

ఆత్మకూర్ (ఎస్): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలి మెట్టు కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ మర్ల స్వర్ణలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి తొలిమెట్టు టీఎల్ఎం మేళాను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధించేందుకే ఈ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ధారాసింగ్, సర్పంచ్ తంగెళ్ల వీరారెడ్డి, ఎంపీడీఓ మల్సూర్ నాయక్, ఎస్సై యాదవేంద్ర రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్ నాయక్, శ్రీదేవి, రంగాచారి, కృష్ణ, టీఆర్ఎస్ జిల్లా నాయకులు మర్ల చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు గోపగాని సుధాకర్, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస నాయుడు, జిల్లా జానయ్య, సుదర్శన్‌రెడ్డి, రఘు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళాతో సామర్థ్యాలు పెంపు

మద్దిరాల : విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) మేళాలు నిర్వహిస్తోందని ఎంపీపీ జి.ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంభవీరన్నగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోరెంట్ల, మద్దిరాల స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్ఎం మేళాను పరిశీలించి మాట్లాడారు. ఉపకరణాల ద్వారా విద్యార్థులకు బోధన చేస్తే పాఠ్యాంశాలను మరిచిపోకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంతియాజ్‌ఖాతూన్ రజాక్, ఎంపీటీసీ మార్త అనిత కృష్ణమూర్తి, మండల విద్యాధికారి రాములు నాయక్, ప్రధానోపాధ్యాయులు రమావత్ రమేష్, శివయ్య, వెంటయ్య, చిలక శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెన్‌పహాడ్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంపై ప్రదర్శనలు చేసిన వివిధ అంశాలను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వస్త్రాం నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనుములపురి శ్రీనయ్య, డీఆర్పీలు శ్రీదేవి, శ్రీనివాస్, ఎమ్మార్పీలు నల్లా శ్రీనివాస్, నాగయ్య, రాజ్‌కుమార్, విజయ, సీఆర్పీలు మామిడి సైదయ్య, వహిద్, నాగు నాయక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం


సూర్యాపేటలో జెండా ఆవిష్కరిస్తున్న రాజయ్య

భానుపురి (సూర్యాపేట) : అణగారిన కులాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాడుతున్నామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి యాతాకుల రాజయ్య మాదిగ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు మహజన సోషలిస్టు పార్టీ పదవ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వతంత్ర భారతంలో విద్యా, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగంలో సరైన వాటా లభించని అన్ని వర్గాల కులాల పక్షాన మంద కృష్ణ మాదిగ పోరాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, కనకయ్య, పుట్టల మల్లేష్, విజయ్, చంద్రశేఖర్, మేడి కృష్ణ, దైద వెంకన్న, శ్రీనివాస్, చింత వెంకన్న, వినయ్, నవీన్, కిరణ్ కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

అర్వపల్లి : దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు లింగమంతులస్వామి జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.5కోట్లు నిధులు మంజూరు చేయడం పట్ల జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మట్టపల్లి రాముయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధికి సీఎం కేసీఆర్‌తో నిధులు మంజూరు చేయించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ లింగయ్యయాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సంఘం ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్‌యాదవ్, దొంగర మహేష్, వెంకటేశ్వర్లు, ఎం.సైదులు, నాగయ్య, హెచ్.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఉన్నారు.

సర్వే నంబర్ల వారీగా నమోదు


వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ శ్రీనివాస్

తిరుమలగిరి (తుంగతుర్తి) : రైతులు ఏ సర్వే నంబర్‌లో ఏయే పంటలు వేస్తారో నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి జి.శ్రీనివాస్ కోరారు. బుధవారం సిద్దిసముద్రం గ్రామంలో సర్వే నంబర్ల వారీగా పంటల వివరాలను మొబైల్ ఫోన్ యాప్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏ పంటలు ఎంతెంత విస్తీర్ణంలో వేశారో పూర్తి సమాచారం అందించాలని కోరారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న జన్యా సంస్థ, సువెన్ కంపెనీ సభ్యులు

సూర్యాపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జన్యా సంస్థ ఫౌండర్ వేణుప్రియా నాదెళ్ల, సువెన్ ఫార్మా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కెవి శేషగిరిరావు అన్నారు. సువెన్ ఫార్మా కంపెనీ ఆర్థిక సహకారంతో జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని ఇమాంపేట గ్రామ సమీపంలో ఆదర్శ పాఠశాలలో జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.50లక్షల విలువైన సైన్స్, మాథ్స్ కిట్లను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సువెన్ ఫార్మా హెచ్ఓడీలు పీజు రాయుడు, బూర రాములు, ఎంవీ రమణ, పీవీ రమణ, జన్యా ఫౌండేషన్ సభ్యులు సురేంద్రకుమార్, అంజన్‌కుమార్, ప్రిన్సిపాల్ శంకర్ నాయక్, డీఎస్‌వో దేవరాజ్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


అర్వపల్లి : అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నూతనకల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూతనకల్ ఎస్ఐ వై.ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వ్యక్తుల ఫోన్ నంబర్లను ఎత్తకూడదని, కొత్త వ్యక్తులకు ఆధార్, బ్యాంక్ మొదలగు వివరాలను అందించరాదని ఆయన తెలిపారు. సెల్‌ఫోన్‌లో వివిధ యాప్‌ల పేరుతో మెసేజ్‌లను పంపిస్తున్నారని తెలియని మెసేజ్‌లను యాప్‌లను డౌన్‌లోడ్ చేయకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అర్వపల్లి ఏఎస్ఐ కేతిరి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం కాసర్లపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్‌పై విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సైబర్ నేరాలతో మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం యల్లయ్య, తండు రవికుమార్‌గౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వికాస్'లో ఫ్రెషర్స్ డే వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేట రూరల్: మండల పరిధిలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో చదువు పూర్తి చేసిన ప్రతి విద్యార్థి వారి జీవితాల్లో స్థిరపడ్డారని హైదరాబాద్‌కు చెందిన సీఎస్‌కే బయోకేర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ జూలకంటి కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం వికాస్ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ సైన్స్‌లో జరిగిన ఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రామ్‌దాస్, ప్రిన్సిపాల్ ఆడెపు రమేష్, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్, నీలమ్మ, నరేష్, శ్రీనివాసరావు, నవీన్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం కళకళ

- జాజిరెడ్డిగూడెం లైబ్రరీకి వస్తున్న నిరుద్యోగ యువత
- అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు
- రోజూ వందమందికిపైగా ప్రిపరేషన్


గ్రంథాలయంలో ప్రిపరేషన్ కొనసాగిస్తున్న నిరుద్యోగులు

అర్వపల్లి: గత రెండు మూడు నెలల కిత్రందాకా పదిఇరవై మందితో కనిపించి జాజిరెడ్డిగూడెం గ్రంథాలయం నేడు వందలాది మందితో కళకళలాడుతోంది. వివిధ రకాల ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నోటిఫికేషన్లు విడుదల చేస్తుండడంతో రూ.వేల వేలు పెట్టి కోచింగ్‌లకు వెళ్లలేని పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన యువత స్థానికంగా ఉన్న గ్రంథాలయయం బాటపడుతున్నారు. ఉదయం పూట గ్రంథాలయాలు తెరిచినప్పటి నుంచి రాత్రి మూసేంత వరకు అక్కడే ఉండి ప్రిపేరవుతున్నారు. ఈ గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉండడంతో గ్రామ యువతతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం రోజుకు వందమందికిపైగా నిరుద్యోగులు వచ్చి చదువుకుంటున్నారు. 380 మంది సభ్యత్వం ఉన్న ఈ గ్రంథాలయానికి శాశ్వత లైబ్రేరియన్ లేనప్పటికీ అవసరమైన పుస్తకాలు ఉండడంతో నిరుద్యోగ యువత తరలి వచ్చి వినియోగించుకుంటున్నారు.

ఉద్యోగార్థులకు ప్రత్యేక గది ఏర్పాటు

పోటీ పరీక్షల నేపథ్యంలో జాజిరెడ్డిగూడెం గ్రంథాలయంలో ఉద్యోగార్థుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థతోపాటు సీఐ ఎల్లెంల మన్మోహన్, మైనింగ్ అధికారి నర్సింగ రమేష్, పలువురు దాతలు సమకూర్చారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో గ్రూప్–1, 2, 3, 4, పోలీస్ ఉద్యోగాలు, గురుకులాలు తదితర ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 4వేల సాధారణ పుస్తకాలతోపాటు 300 పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి. దీంతో వివిధ ఉద్యోగాలకు ప్రిపేరయ్యే వంద మందికిపైగా నిరుద్యోగులు రేయింబవళ్లు చదువుకుంటున్నారు.

కోచింగ్ సెంటర్‌కు వెళ్లలేక..



వేల రూపాయలు వెచ్చించి కోచింగ్ సెంటర్లకు వెళ్లలేక స్థానిక గ్రంథాలయంలో ప్రిపేరవుతున్నా. గ్రూప్–2, 3, 4లకు సిద్ధమవుతున్నాను. ఈ గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు ప్రత్యేక గది ఏర్పాటు చేయడం చాలా బాగుంది.

– పోలెబోయిన వీరేష్, నిరుద్యోగి

అన్నిరకాల పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి



మా ఊరి గ్రంథాలయంలో అన్ని రకాల పోటీపరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. డీఎస్సీకి ప్రిపేరవుతున్నాను. గ్రంథాలయంలో కావాల్సిన ఫర్నిచర్ ఏర్పాటు చేయాలి.

– బండారి నవీన్‌కుమార్, నిరుద్యోగి

పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్‌కు సిద్ధమవుతున్నా



తాను పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్‌కు ప్రిపేరవుతున్నాను. ఇప్పటికే ఈవెంట్స్‌లో క్వాలిఫై అయ్యాను. ఈ గ్రంథాలయంలో అన్నిరకాల పోటీ పరీక్షల పుస్తకాలు ఉడడంతో ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నాను.

– మాదగాని మహేష్